# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

# మానవ సంబంధాలు

-వి.ఎల్.పద్మసుందరి

"అన్నయ్యా,

ఎలా ఉన్నావు? క్షమించు. ప్రతీసారీ ఉత్తరం మేము క్షేమం...నువ్వు క్షేమమని తలుస్తాను అనే మొదలుపెడదాం అనుకుంటాను. కానీ స్పెషలిస్టుకి చూపిస్తే ఖరీదైన మందులు రాస్తాడని భయపడి ఆర్.ఎం.పి. డాక్టర్ దగ్గర అరకొర వైద్యం చేయిస్తూ మామూలు అనారోగ్యమేనని మమ్మల్ని మేము మభ్యపెట్టుకొంటూ మంచానికి అంకితం చేసిన అమ్మ అసహాయ స్థితి కళ్లముందు కదిలి చేయి వణుకుతుంది.

బావ కోర్కెల చిట్టా పట్టుకొని పుట్టింటికీ అత్తింటికీ షటిల్ చేసే అక్క దీనమైన వదనం 'నేను క్షేమమా?' అని ప్రశ్నిస్తుంది. తన ఈడుపిల్లలు బాల్యంలోని ఆనందాన్ని అనుభవిస్తుంటే 'ఈ నెలైనా నాన్న బస్‌పాస్ కొనిస్తాడా? ఈసారైనా టైముకి ఫీజు కట్టగలనా?' అని దిగులుపడే చిన్నా బేలమొహం గుర్తొస్తుంది. అప్పులు చేసి అత్తింటికి పంపినా అస్తవ్యస్తంగా ఉన్న పెద్దకూతురు కాపురాన్ని గుండెలమీద దింపుకోవలసిన భారంలా ఉన్న చిన్నకూతుర్ని, చేతికి అందిరాని చిన్నకొడు



## అద్దె ఇల్లు

''అద్దె ఇల్లు ఉందా?'' అడిగాడు రైల్వేపోర్టర్.

''ఉంది'' అని చెప్పాడు ఇంటి ఓనరు.

''సరే అయితే'' అని తలమీది బట్టను తీసి అద్దె ఇంట్లో వేసి చక్కాపోయాడు రైల్వేపోర్టర్.

**–మన్నవ లక్ష్మీకాంతమ్మ** (విజయవాడ)

## విడాకులు

''మీ ఆవిడ్ని రాత్రి పగలు అదే పనిగా టీవీ సీరియల్స్ చూడమని ప్రోత్సహిస్తున్నావట. ఎందుకు?'' అడిగాడు సురేష్, ఆనందరావుని.

''ఏంలేదు. మా ఆవిడకు విడాకులివ్వాలని లాయర్‌ని సంప్రదిస్తే పిచ్చెక్కితే భార్యకు విడాకులు ఇవ్వవచ్చని చెప్పాడు. అందుకే...'' తాపీగా చెప్పాడు ఆనందరావు.

**–గానుగ సత్యనారాయణ** (తిప్పర్తి)

## కథలు

''ఏరా! నువ్వు కథలు రాస్తూ డబ్బులు సంపాదిస్తున్నావట. నాక్కూడా ఆ ఉపాయం చెప్పవూ?'' అడిగాడు రాజు.

''డబ్బులు పంపించమంటూ మీ నాన్నకి ఆమాత్రం ఉత్తరాలు రాయలేవా?'' విసుగ్గా చెప్పాడు రమేష్.

**–శ్రీనివాస్ వల్లాల** (నారాయణఖేడ్)

కును, రోగంతో మంచం పట్టిన భార్యను చూస్తూ అందనంత ఎత్తుకు ఎదిగిన పెద్దకొడుకు ఏమైనా సాయం అందించకపోతాడా? అని ప్రతిరోజూ పోస్టుకోసం ఎదురుచూసే రిటైరైన నాన్న ఆశ నిరాశల నిట్టూర్పుల ధ్వని నా చెవులకు వినిపిస్తుంది.

అందుకేరా అన్నయ్యా 'మేము క్షేమం' అనే చిన్నమాట రాయడానికి నేను సంకోచిస్తాను.

సీరియస్‌గా రాస్తున్న నేను తలుపు చప్పుడికి ఉలిక్కి పడి, లేచి వెళ్లి తలుపు తీశాను.

"హాయ్ బాగున్నావా?" పలకరిస్తూ లోపలికి వచ్చింది మాధవి. వెనకే శ్యామల ఆంటీ, రాఘవ అంకుల్, కిరణ్ వచ్చారు.

"అబ్బా! ఎన్నాళ్లకి గుర్తొచ్చాం?" నవ్వుతూ ఆహ్వానించాం నేనూ నాన్నగారూ.


"పాపా! ఎవరే వచ్చారు?" అమ్మ లోపలి నుండి అడిగింది. నేను సమాధానం చెప్పేలోగానే ఆంటీ నా వెనకే లోపలికి వచ్చి అమ్మ పక్కనే మంచం మీద కూర్చున్నారు. వాళ్లకి మంచినీళ్లు ఇచ్చి పక్కింటికి పాల కోసం పరుగెత్తాను. చిన్నా అక్కడే క్యారమ్స్ ఆడుతున్నాడు. "చిన్నా! కిరణ్ వచ్చాడు నీకోసం చూస్తున్నాడు వెళ్లు" అన్నాను.

"కిరణ్ వచ్చాడా?" అంటూ ఆట మధ్యలో వదిలేసి ఇంట్లోకి పరిగెత్తాడు చిన్నా.

"ఎవరు పాపా వాళ్లు? బంధువులా?" ఆరాగా అడిగింది పక్కింటి ఆంటీ.

"అంతకన్నా ఎక్కువే ఆంటీ, మా నాన్నగారి బాల్య స్నేహితుడు. ఆర్టీసీలో చేస్తారు. మీరు వచ్చే ముందువరకు ఈ వాటాలోనే ఉండేవారు. ఐదేళ్ల క్రితం సొంత ఇల్లు కట్టుకొని వెళ్లిపోయారు. వాళ్లమ్మాయి మాధవీ నేనూ క్లాస్‌మేట్స్. మా చిన్నా, కిరణ్ ఒకే నెల్లో పుట్టారు. చాలా కాలానికి వచ్చారు వాళ్లు" గబగబా సంతోషంగా చెప్పాను.

"అలాగా! నిన్న మీ తమ్ముడు కాఫీ పొడుం ఇమ్మన్నావని పట్టుకెళ్లాడు. త్వరగా ఇచ్చెయ్యమ్మా.. మీ అంకుల్‌కి ఇలాంటివి నచ్చవు" పాలు అందిస్తూ హెచ్చరికగా అంది. మనసు చివుక్కుమంది.




''అలాగే ఆంటీ'' అని తలూపి, వచ్చి 'టీ' కలపసాగాను. లోపలినుండి అమ్మ, ఆంటీల సంభాషణ వినిపిస్తోంది.

"గుండె దడ అంటే ఎవరైనా స్పెషలిస్ట్‌కు చూపించుకోవాలి వదినా! ఇలాంటివి అశ్రద్ధ చేస్తే ప్రమాదం. ఎంత పాడైపోయారో తెలుసా?'' బాధగా అంటోంది శ్యామల ఆంటీ.

"ఆ..మామూలు దడే శ్యామలా? అదీగాక మనూళ్లో అంత గొప్ప స్పెషలిస్టులెవరున్నారు చెప్పండి. మొన్ననే మా పెద్దాడికి ఇలా నీరసంగా ఉందని ఉత్తరం రాస్తే, 'నువ్వేం కంగారుపడకు. నేను రాగానే బొంబాయో, హైదరాబాదో తీసుకెళ్లి చూపిస్తాను. అవసరమైతే అమెరికాకే తీసుకెళతాను' అని రాశాడు. ఈమాత్రానికే తొందరపడడం ఎందుకని మీ అన్నగారు చూపిస్తానంటున్నా నేనే వద్దని మొండికేస్తున్నాను...'' అవలీలగా అమ్మ ఆడేస్తున్న అబద్ధానికి ఆశ్చర్యపోతూ 'టీ' వడకట్టి చిన్న గ్లాసుల్లో పోసి, గ్లాసులు ఓ కంచంలో పెట్టుకొని అమ్మా, ఆంటీ, వాళ్ల పక్కనే కూర్చున్న మాధవికి అందించి హాల్లోకి వచ్చాను.

"మీ పెద్దాడు అక్కడనుండి ఏమైనా పంపుతున్నాడా? ఆమధ్య పెద్దపిల్ల పెళ్లికి, వాడి అమెరికా ప్రయాణానికి అప్పులయ్యాయి అన్నావు. ఇల్లు కూడా తనఖాలో ఉందన్నావు?'' టీ గ్లాసు అందుకొంటూ నాన్న దగ్గరి చనువుతో అడిగారు అంకుల్.

"ఇంకా ఎక్కడరా! వాడెళ్లి రెండేళ్లేగా అవుతా! వాడే స్థిరపడలేదు. అయినా వీలు చేసుకొని కాస్తో కూస్తో పంపుతున్నాడనుకో. వాడు వచ్చేప్పుడైతే ఖర్చుల పేరు చెప్పి పెద్దమొత్తాన్ని తెచ్చుకోవచ్చుట. వాడు రాగానే అన్ని సమస్యలు తీరిపోతాయి'' అంటున్న నాన్న కళ్లలోకి చూసి, తలొంచుకొని టీ అందించి కిరణ్ కోసం వెతికాను. నా చూపులు కనిపెట్టిన అంకుల్ "వాడెప్పుడో చిన్నాతో కలిసి బాదం చెట్టుకింద చేరిపోయాడమ్మా! బయలుదేరినప్పటినుండి కాయలు కోసుకోవడం గొడవే!'' అంటూ నవ్వారు.

నేనూ నవ్వుతూ వీధిలో గేటు కుడిపక్కనున్న బాదం చెట్టు కిందకి వెళ్లాను. చిన్నా రాయిమీద కాయ వాలుగా పట్టుకొంటే కిరణ్ మరో రాయితో కొడుతున్నాడు.

"అరే చిన్నా! మర్చిపోయాన్రా చెప్పడం. నేను ఫస్ట్‌క్లాసు తెచ్చుకున్నానని మా డాడీ నాకు హీరో సైకిల్ కొన్నారు. ఇప్పుడు నేను సైకిల్ మీదే స్కూలుకి వెళ్తున్నాను'' ఉత్సాహంగా చెప్పాడు కిరణ్.

చిన్నా మొహం నల్లబడింది. వాడిని చూస్తే నాకు చాలా జాలిగా అనిపించింది. కానీ నేను ఏమాత్రం ఊహించనివిధంగా క్షణంలో తేరుకొని "నాకూ ఫస్ట్‌క్లాసు వచ్చిందని మా అన్నయ్యకి రాస్తే నాకోసం అమెరికన్ మేడ్ ఒరిజినల్ హీరో సైకిల్ తీసుకువస్తానన్నాడు. అందుకే మానాన్న ఇక్కడ కొంటానన్నా వద్దన్నాను'' కిరణ్ అడగకపోయినా గర్వంగా చెప్పాడు.

వాడి తెలివికి నా కళ్లు ఆశ్చర్యంగా విచ్చుకొ

న్నాయి. హీరో కంపెనీ అమెరికాలో ఉందో లేదో కూడా నాకే తెలియదు. అలాంటిది అన్నమీద భరోసాతో అంత అబద్ధాన్ని ఆడేసినవాడు 'నిజం కదక్కా' అంటూ నన్ను సాక్ష్యానికి పిలుస్తాడేమోననే భయంతో గబగబా లోపలికి వచ్చేశాను.

"అబ్బాయి ఇంజినీరు చేస్తున్నాడు. కట్నం లక్షన్నర. లాంఛనాలు అవీ, ఇవీ అన్నీ కలిపి రెండులక్షలు. అదికాక ఇంకా పెళ్లి ఖర్చులున్నాయనుకో. అయినా ఏదో ఈ పెళ్లయిపోతే మా బాధ్యత తీరిపోతుంది. ఇంక కిరణ్ అంటావా? మొగాడు. వాడికో దారి చూపించలేకపోం కదా!" నాన్నగారితో చెబుతున్న అంకుల్ మాటలు విని మాధవి దగ్గరకెళ్లి "కంగ్రాట్స్! నీ పెళ్లటకదా" చెయ్యి ఊపుతూ అన్నాను. మాధవి సిగ్గుపడింది.

"వచ్చిన పనే అది. మాటల్లో పడి మర్చిపోయాను. వచ్చేనెల పదిహేనున ముహూర్తం. ఈ శుభవార్త నీకు, అన్నయ్యగారికి చెప్పి పిలవాలని వచ్చాం వదినా"

మాధవిని దగ్గరకు తీసుకొని "ఏమే మధూ! వచ్చిన దగ్గరనుండి అంత నిశ్శబ్దంగా ఉన్నావు. అందుకేనా? ఇదంతా సిగ్గే. నాదగ్గర సిగ్గెందుకే పిచ్చిపిల్ల" ఆప్యాయంగా అంది అమ్మ. మాధవి సిగ్గుపడుతూ అమ్మ కాళ్లకి నమస్కరించింది. అమ్మ దీవించి లేపి పెళ్లివారి వివరాలు అడుగుతుంటే ఆంటీ చెబుతోంది.

తన ముందే తన పెళ్లి మాటలు జరుగుతుండడంతో బిడియపడి "నువ్వు తాగావా టీ?" నన్నడిగింది మాధవి.

"లోపలుంది. నేను తాగుతుంటే నువ్వు మీ శ్రీవారి విశేషాలు చెబుదువుగాని రా" అంటూ వంటింట్లోకి లాక్కుపోయాను. నా టీ గ్లాసు తీసుకొని పెరటి గుమ్మం మెట్లమీద కూర్చుంటూ "ఇక మొదలుపెట్టు ఆయనగారి గుణగణాలు" కొంటెగా అన్నాను.

"ఆ సంగతి తరువాత, ముందు నీ విషయం చెప్పు. మరి నీ పెళ్లెప్పుడు?" నా పక్కన కూర్చుంటూ అడిగింది.

తాగుతున్న టీ చేదుగా అనిపించింది ఆ ప్రశ్నకి. 'పెళ్లయి అయిదేళ్లయినా అక్క కాపురమే ఓ కొలిక్కి రాక చస్తుంటే నా పెళ్లొకటే తక్కువయ్యింది' విసుగ్గా మనసులో అనుకున్నా, అభిమానంగా అడిగే మాధవికి చెప్పలేకపోయాను.


"సంబంధాలు చూస్తున్నారు. మామూలువి చూస్తే అన్నయ్య నొచ్చుకుంటాడు. పెద్దవి చూడడానికి అన్నయ్య ఇక్కడ లేడు. అదీకాక ఈమధ్యే లెటర్ రాశాడు. అక్కడ తెలుగు అసోసియేషన్‌లో నాగురించి చెప్పి సంబంధాలు చూస్తున్నాడట. మళ్లీ మనం ఇక్కడ తొందరపడడం ఎందుకని నాన్న ఆలోచిస్తున్నారు"

"అయితే త్వరలో తమరు కూడా..." నవ్వుతూ అంది మాధవి.

నేనూ బలవంతాన నవ్వాను. నేను మాత్రం నా ఆలోచనల్లో నిలువెల్లా మునిగిపోయాను. అమ్మా, నాన్న, చిన్నా, అంతా అన్నయ్యని అడ్డం పెట్టుకొని ఎలా అబద్ధాలు ఆడగలిగారా అని ఆశ్చర్యపోయిన నేనూ అదే పనిచేశాను. నిజం చెబితే బాధపడతారనే కాదేమో! నిజం చెపితే నమ్మరనే భయం, లోకువైపోతామేమోననే బెరుకు! అన్నయ్య నెలనెలా ఏమీ పంపడు. మూడు నెల్లకో, ఆరునెల్లకో పంపే డబ్బుకాస్తా వడ్డీలకీ, అమ్మ మందులకో, బావ కోర్కెలకో ఖర్చయిపోతుంది. డబ్బులేదని చెప్పినా ఎవరూ నమ్మరు. అన్నీ అబద్ధాలే! అమ్మని వైద్యానికి అమెరికా తీసుకెళతానన్నాడని చెప్పడం, నాన్న ఇండియాకి వచ్చేపుడు పెద్దమొత్తం తెస్తాడన్నాడని రాయడం, చిన్నాకి హీరోసైకిల్ తీసుకువస్తాననడం, ఆఖరికి నాకు అమెరికాలో సంబంధాలు చూడడం అన్నీ అబద్ధాలే. కానీ ఎవరూ నమ్మరు. పెన్షన్ చాలక, అన్నయ్య డబ్బు పంపక, రిటైరైన నాన్న ఎకౌంట్స్ రాస్తూ అరవై ఏళ్ల వయసులో మళ్లీ కష్టపడుతున్నారనీ, బియ్యే చదివిన నేను కాన్వెంట్‌లో చేస్తున్నాననీ చెబితే ఎవరూ నమ్మరు. అన్నయ్య అమెరికాలో ఉన్నందువల్లే ఉద్యోగం లేనివాడు కూడా లక్షల్లో కట్నం అడుగుతున్నారని, ఇవ్వలేమంటే కొడుకు అమెరికా నుండి పంపేదంతా ఏ మూల దాస్తున్నారు, కూతురుకి పెట్టటానికి ఏడుస్తున్నారు అంటూ వెనక్కి వెళ్లిపోతున్నారంటే ఎవరూ నమ్మరు. అన్నయ్య అమెరికా వెళ్లేప్పుడు చాలా కలలు ఉండేవి. మా కష్టాలు తీరతాయని ఆశ ఉండేది. ఇప్పుడు ఇక్కడే ఉంటే, కలో గంజో తాగి కలిసి బ్రతికేవాళ్లం. ఈ బాధలుండేవి కావు అనిపిస్తోంది. తలచుకుంటే కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. గభాలున ఓణీ కొంగుతో చాటుగా అద్దుకున్నాను. లోపలి నుండి అమ్మ కేక పెట్టింది. "పాపా! ఆంటీ వాళ్లు వెళతారుట, బొట్టు పెట్టు!" అని.

'రక్షించావురా దేవుడా' అనుకుంటూ లేచి లోపలికి వెళ్లాను.

అందరం వీధిగుమ్మం దాకా వెళ్లి ఆంటీ, అంకుల్ వాళ్లకి వీడ్కోలు చెప్పాం. వాళ్లు సందు మలుపు తిరుగుతుండగా చిత్రంగా మా నలుగురి నోటి నుండి ఒకేసారి గాఢమైన నిట్టూర్పు వెలువడింది. ★



## అంతా మాయ!

సినిమాల్లో కొన్ని సీన్స్‌లో నటించడానికి హీరోహీరోయిన్లు నెర్వస్‌గా ఫీలవుతుంటారు. కెరీర్‌లోకొచ్చి చాలాకాలమే అయినా సరైన బ్రేక్ లేని ఘన చరిత్ర ఉన్న అమితాబ్ తనయుడు అభిషేక్‌కి ఈమధ్య ఇలాంటి అనుభవమే ఎదురైనట్టుంది. లారాదత్తాతో కలిసి నటించిన 'ముంబైసే ఆయా మేరా దోస్త్'లో లారాని ముద్దుపెట్టుకునే ఒక సీన్‌లో సరిగా నటించలేకపోయాడట. నటులతో చాలా సరదాగా ఉండే లారాతో అభిషేక్ ఇలా ఉండడం దర్శకుడితో పాటూ లారాకి కూడా కొంచెం చికాకు కలిగించిందట. మనసు సరిగా లేక ఇలా జరిగిందా, లారాతో పరిచయం లేకనా అనేది అంతుబట్టడంలేదట.

